క్లుప్తంగా

అఖండ రామనామస్మరణ ప్రారంభం


రామనామస్మరణ చేస్తున్న భజన భక్తులు

మాడుగుల రూరల్: శ్రీరామ నవమి ఉత్సవాల్లో భాగంగా కె.జె.పురం రామాలయంలో మంగళవారం ఉదయం 5 గంటలకు అఖండ రామనామస్మరణ ప్రారంభమైంది. ఈ కార్యక్రమం బుధవారం ఉదయం 5 గంటలతో ముగిస్తుంది. ఈ సందర్భంగా భజన భక్తులు పాల్గొన్నారు. స్వామివారి కల్యాణోత్సవం, మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించనున్నారు.

ఘనంగా వీరేశలింగం జయంతి


వీరేశలింగం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

మాకవరపాలెం: తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాలలో కందుకూరి వీరేశలింగం జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో వీరేశలింగం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం హెచ్‌ఎం కె.రాము మాట్లాడుతూ వీరేశలింగం పంతులు బాలికల విద్యకు ఎంతో కృషి చేశారన్నారు. కులవివక్షకు వ్యతిరేకంగా పోరాటాలు చేశారన్నారు. వీరేశలింగం సేవలను విద్యార్థులకు వివరించారు. ఉపాధ్యాయిని సంతోషి పాల్గొన్నారు.

సమయపాలన పాటించకుంటే చర్యలు


సచివాలయంలో రికార్డులను తనిఖీ చేస్తున్న ఎంపీడీవో

మాకవరపాలెం: సకాలంలో విధులకు హాజరుకాకుంటే చర్యలు తప్పవని ఎంపీడీవో జి.చంద్రరావు సచివాలయ సిబ్బందిని హెచ్చరించారు. పి.పి.అగ్రహారం సచివాలయాన్ని ఆయన మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. నిత్యం సకాలంలో విధులకు హాజరు కావాలని, ప్రజల నుంచి ఫిర్యాదులందితే చర్యలు తప్పవన్నారు. అనంతరం రామన్నపాలెం, జడ్‌.గంగవరంలో ఉపాధి పనులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలిచ్చారు.

మెనూ అమలును నిర్లక్ష్యం చేయొద్దు


విద్యార్థినికి ప్రశ్నలు వేస్తున్న ఎంపీడీవో రాంబాబు

నాతవరం: పాఠశాలల్లో మెనూ అమలులో నిర్లక్ష్యం చేయొద్దని ఎంపీడీవో జాగరపు రాంబాబు తెలిపారు. ఆయన మంగళవారం వెదురుపల్లి పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి విద్యా సామర్థ్యాన్ని తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం వంటలను రుచి చూశారు. నిర్వాహకులకు, హెచ్‌ఎంకు పలు సూచనలు చేశారు. మాధవనగరంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి చిన్నారులతో మాట్లాడారు. ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో కేంద్రానికి వచ్చే గర్భిణులు, బాలింతలు, చిన్నారుల పట్ల తగు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. వల్సంపేట గుమ్మడిగొండ గ్రామ సచివాలయాలను తనిఖీలు చేశారు. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం దగ్గర్నుంచి రాజకీయ వేడి ఉంటుందని, దానికి తగ్గట్టుగా మనమంతా సిద్ధంగా ఉండాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు చినబాబు, రమణ, చందు, శివ సిబ్బంది పాల్గొన్నారు.

రిటైర్డ్ వీఆర్వో మృతికి సంతాపం

దేవరాపల్లి: విశ్రాంత వీఆర్వో అల్లు సత్యనారాయణ(80) మృతికి పలువురు సంతాపం తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన మంగళవారం సాయంత్రం గుండెపోటుతో మృతి చెందారు. దేవరాపల్లి, కె. కోటపాడు మండలాల్లో వీఆర్వోగా సేవలందించారు. ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బూడి ముత్యాలనాయుడు, ఈర్లె అనురాధ సంతాపం తెలిపారు.

అయ్యన్నను నమ్ముకుంటే టీడీపీ కార్యకర్తలకు కష్టాలే

- నాతో కలిసి రండి.. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకుందాం
- ఎన్నికల ప్రచారంలో నర్సీపట్నం ఎమ్మెల్యే గణేష్


కరపత్రం అందజేసి ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే గణేష్


మాకవరపాలెం మండలం తామరంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన కార్యకర్తలతో ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: అయ్యన్నపాత్రుడిని నమ్ముకుంటే టీడీపీ కార్యకర్తలు నట్టేటా మునగటం ఖాయమని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో అయ్యన్నపాత్రుడు చిత్తుచిత్తుగా ఓడిపోవటం ఖాయమన్నారు. మనమంతా కలిసిమెలసి ఉండాల్సిన వాళ్లమన్న విషయాన్ని టీడీపీ కార్యకర్తలు గ్రహించాలన్నారు. మున్సిపాలిటీలోని 9, 28 వార్డుల్లో చింతకాయల సన్యాసిపాత్రుడుతో కలిసి మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజలంతా సంతృప్తికరంగా ఉన్నారన్నారు. మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వాన్ని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. డిగ్రీ కళాశాల, పాలిటెక్నిక్, ఆస్పత్రి తీసుకువచ్చానని అయ్యన్నపాత్రుడు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఎమ్మెల్యేగా ‘నువ్వున్నా.. నేనున్నా బడి, గుడి, ఆస్పత్రి వాటంతట అవే వస్తాయన్న’ విషయాన్ని తెలుసుకోవాలని హితవు పలికారు. డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలు తప్ప అంతకు మించి ఏమైనా చేసి ఉంటే సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. మొదటి సారి ఎమ్మెల్యేగా గెలిచి సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గానికి మెడికల్ కళాశాల తీసుకువచ్చానని తెలిపారు. రాజకీయ స్వార్థం కోసం సొంత సోదరులను దూరం చేసుకున్న అయ్యన్నపాత్రుడు నియోజకవర్గ ప్రజలను ఏమి ఉద్ధరిస్తారని ఎద్దేవా చేశారు. అయ్యన్నను నమ్ముకుని తిరిగిన వారు ఎవరైనా ఆర్థికంగా బాగుపడ్డారా అని ప్రశ్నించారు. పదవులు కూడా ఎవరికీ ఇవ్వనివ్వలేదన్నారు. ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించుకుని మన ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు. 30 వేల ఓట్ల మెజార్టీతో తాను ఎమ్మెల్యేగా గెలుపొందటం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. తొలుత ఇంటింటి ప్రచారంలో


గణేష్ అన్నా విజయం నీదే అంటూ.. చిరునవ్వు చిందిస్తున్న మహిళ

ఎమ్మెల్యే గణేష్‌కు వార్డు ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. మహిళలు హారతులు పట్టారు. ప్రతి ఒక్కరూ ఎమ్మెల్యేను ఆప్యాయతతో పలకరించి విజయం నీదే అంటూ దీవించారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జులు ఎల్లేటి శ్రీనివాసరావు, జాన్, మున్సిపల్ వైస్ చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, మాజీ చైర్‌పర్సన్ గుడబండి ఆదిలక్ష్మి, మాజీ వైస్ చైర్మన్ గొలుసు నర్సింహమూర్తి, పార్టీ అధ్యక్షుడు ఏకా శివ, చింతకాయల వరుణ్, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీకి ప్రజలే బలం


కార్యక్రమంలో మాట్లాడుతున్న ధర్మశ్రీ

- కూటమి అభ్యర్థులకు ఓటుతో గుణపాఠం
- చోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి, విప్ కరణం ధర్మశ్రీ


ధర్మశ్రీ సమక్షంలో పార్టీలో చేరుతున్న శ్రీను తదితరులు

రావికమతం: కూటమి పార్టీల అభ్యర్థులకు దండిగా డబ్బులు ఉంటే మనకు ప్రజల ఓట్లు ఉన్నాయని, ప్రతి కార్యకర్త గెలుపే ధ్యేయంగా పనిచేయాలని ప్రభుత్వ విప్, చోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి కరణం ధర్మశ్రీ తెలిపారు. మంగళవారం రావికమతం, కొత్తకోట గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, ముఖ్య నాయకుల సమావేశాలు వేర్వేరుగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ధర్మశ్రీ పాల్గొని మాట్లాడారు. చంద్రబాబు అవినీతిపరులకు ధనవంతులకే టికెట్లు ఇచ్చాడని, వాళ్లెన్ని రూ.కోట్లు కుమ్మరించినా ప్రజల ఓట్లు మాత్రం మనకే దండిగా పడతాయని ధీమా వ్యక్తం చేశారు. ప్రతి కార్యకర్త గెలుపే ధ్యేయంగా, ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపించేందుకు శ్రమించాలని కోరారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వారి అభిమానాన్ని ఓట్లుగా మరల్చాలన్నారు. ఎంపీపీ పైల రాజు, జెడ్పీటీసీ తలారి రమణమ్మఆదిమూర్తి, పార్టీ మండలాధ్యక్షుడు ముక్కా మహాలక్ష్మినాయుడు, డీసీఎంఎస్ డైరెక్టర్ గుమ్ముడు సత్యదేవ, మండల సచివాలయ కన్వీనర్ కంచిపాటి జగన్నాథరావు, మహిళా కన్వీనర్ లేగా ఉష, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

- టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక

కొత్తకోట గ్రామంలో టీడీపీకి చెందిన యర్ర శ్రీను, కుంచా గణేష్, జోగాడ భూలక్ష్మి, గట్రెడ్డి శ్రీను తదితరులు వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి విప్ ధర్మశ్రీ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

సువర్ణపాలనకు ప్రజలంతా మద్దతు పలకాలి

- గొండుపాలెంలో ఎమ్మెల్యే అభ్యర్థి అనురాధ, బూడి సతీమణి రమణమ్మ ఎన్నికల ప్రచారం


ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి అనురాధ, రమణమ్మ


ఇంటింటికీ వెళ్లి ఓటు వేయాలని కోరుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి అనురాధ

కె.కోటపాడు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల సువర్ణపాలనలో ఎంతో అభివృద్ధి చేసి సంక్షేమం అందించారని, ప్రజలంతా రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మద్దతు పలకాలని మాడుగుల అసెంబ్లీ అభ్యర్థి ఈర్లె అనురాధ కోరారు. ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు సతీమణి రమణమ్మతో కలిసి ఆమె మంగళవారం రాత్రి గొండుపాలెంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వీరికి మహిళలు, గ్రామ పెద్దలు అడుగడుగునా ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లిన అనురాధ సంక్షేమ లబ్ధిని ప్రజలకు, గ్రామాభివృద్ధిని వివరించారు. సీఎం జగన్ సుపరిపాలనకు ప్రజలు మద్దతు పలకాలన్నారు. ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు, ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. కులం, మతం, పార్టీలు తారతమ్యం లేకుండా సీఎం జగన్ ఎంతో మేలు చేశారన్నారు. ప్రజల చెంతకే సచివాలయ, వలంటీర్ వ్యవస్థ తీసుకొచ్చి పాలన అందించిన ఏకైక సీఎం అని అన్నారు. తన తండ్రి వలే ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ సేవ చేస్తానని ఆశీర్వదించాలని కోరారు. ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, ఎంపీటీసీ వంటాకు నారాయణమ్మ, గోవాడ సుగర్ ఫ్యాక్టరీ మాజీ డైరెక్టర్ దొగ్గ ఉమాశంకర్, వంటాకు నాయుడు(మామిడికాయలు), మాజీ సర్పంచ్ వంటాకు శ్రీను, లెక్కల గోపి, గొర్రుపోటు వెంకటరావు, వేచలపు దొరబాబు, బండారు ముత్యాలనాయుడు, చీపురుపల్లి అచ్చిబాబు, శ్రీకాంత్ శ్రీను, పైల కోటేశ్వరరావు, రొంగలి రమేష్, రొంగలి సత్యనారాయణ పాల్గొన్నారు.

గిరిజన పాఠశాలలో సీట్ల భర్తీకి దరఖాస్తులు

మాడుగుల రూరల్: ఎల్.పొన్నవోలు శివారు నరసయ్యపేట(దిబ్బూరు) ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర పాఠశాలలో ఖాళీ సీట్లు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయుడు బావరాజు అప్పారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదో తరగతిలో 20 సీట్లు, ఆరో తరగతిలో 60 సీట్లు, ఎనిమిదో తరగతిలో 20 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆయా తరగతుల్లో చేరే విద్యార్థులు ప్రభుత్వ ప్రోత్సాహకాలతోపాటు ఏపీ గిరిజన సంక్షేమ శాఖ అందించే సదుపాయాలు పొందవచ్చన్నారు. పూర్తి వివరాలకు 9492989123కు సంప్రదించాలని సూచించారు.

ఎ. కొత్తపల్లిలో 406 మందికి వైద్య పరీక్షలు


రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి పూజ్య మేఘన

దేవరాపల్లి: ఎ. కొత్తపల్లిలో మంగళవారం నిర్వహించిన ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. దేవరాపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి ఇ.పూజ్య మేఘన ఆధ్వర్యంలో 406 మంది రోగులను గైనికాలజిస్టు బి. రోజారాణి, జనరల్ డాక్టరు వి.కోటేశ్వరరావు పరీక్షించారు. పలువురికి రక్త, బీపీ, సుగర్ తదితర పరీక్షలు చేశారు. సీహెచ్‌వో పి.ప్రసాదరావు, ఫార్మాసిస్టు అల్లు సత్యమూర్తి, హెల్త్ అసిస్టెంట్లు గోవింద్, జి.బి. శ్రీను, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆ పార్టీలో మా క్యాడర్ చేరలేదు

వైఎస్సార్‌సీపీ నాయకులు


వడ్డాదిలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బుచ్చెయ్యపేట: చోడవరం నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ మెజార్టీని ఎవరూ ఆపలేరని డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనార్దనరావు, పార్టీ వడ్డాది టౌన్ అధ్యక్షుడు దొండా నారాయణమూర్తి తెలిపారు. మంగళవారం వడ్డాదిలో వారు మాట్లాడుతూ 2019 అసెంబ్లీ ఎన్నికల తర్వాత తమ పార్టీలో చేరిన కొంతమంది టీడీపీ నాయకులు పదవులు పొందారన్నారు. ఇప్పుడు కొంత మంది స్వార్థపరుల ప్రలోభాలకు లొంగి ఇటీవల జనసేనలో చేరారన్నారు. వారంతా నిజమైన వైఎస్సార్‌సీపీ నాయకులు కాదన్నారు. వారంతా పదవులకు రాజీనామా చేసి ఇతర పార్టీల్లోకి వెళ్లాలన్నారు. పార్టీలో ఉంటూ ఏనాడూ ప్రజా సేవ చేయని నాయకుడు ఎనిమిదేళ్లుగా నామినేటెడ్ పదవి అనుభవించిన వ్యక్తి వడ్డాదిలో మెజార్టీ గురించి మాట్లాడటం సిగ్గుచేటన్నారు. ఎంపీటీసీలు ఇంటి అప్పారావు, కోరుకొండ లీలావతి రమణ, చోడవరం ఏఎంసీ మాజీ డైరెక్టర్ చింతల శంకరావు, నాయకులు సయ్యపురెడ్డి కొండబాబు, అదత్రా భాస్కరరావు, వీర్ల నానాజీ, తెప్పల నాగేష్ పాల్గొన్నారు.

అత్యవసర ఫోన్ నంబర్లపై అవగాహన


పరికరాల పట్ల అవగాహన కల్పిస్తున్న దృశ్యం

చోడవరం రూరల్: ప్రతీ విద్యార్థి భద్రత, విపత్తులకు సంబంధించిన అత్యవసర సహాయ కేంద్రాల ఫోన్ నంబర్లు, వాటి ద్వారా కలిగే ప్రయోజనాలపై అవగాహన కలిగి ఉండాలని ప్రిన్సిపాల్ టి.రాధాకృష్ణ తెలిపారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు అగ్ని ప్రమాద, విపత్తుల నివారణ తీసుకోవాల్సిన చర్యల పట్ల చోడవరం అగ్నిమాపకదళ సిబ్బందితో అవగాహన కల్పించారు. ఫైర్ ఆఫీసర్ బి.వి.రామస్వామి మాట్లాడుతూ 100, 101, 102, 104, 108 నంబర్ల ద్వారా కలిగే సహాయం, ఏయే శాఖలకు సంబంధించినవి అన్న విషయం తెలిసి ఉండాల న్నారు. వైస్ ప్రిన్సిపాల్ పి.కిరణ్‌కుమార్, ఎన్‌ఎస్‌ఎస్ పీవోలు రత్నభారతి, బి.పిచ్చమ్మ, డి.మాల్యాద్రి, అగ్నిమాపక సిబ్బంది కె.రాము, ఎస్.ప్రసాద్ పాల్గొన్నారు.

మాడుగుల: జాతీయ అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం చీడికాడ మండలం కోనాం బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు, ఉపాధ్యాయినులకు అవగాహన కల్పించారు. కరపత్రాలు పంపిణీ చేశారు. అగ్నిమాపక కేంద్రం అధికారి వి. రాజేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

అయ్యన్నపాత్రుడిపై తమ్ముడి ఆగ్రహం


- మద్యం మత్తులో ఆడవాళ్లపై దౌర్జన్యమా?
- విర్రవీగితే పతనం తప్పదని సన్యాసిపాత్రుడు హెచ్చరిక



మాట్లాడుతున్న చింతకాయల సన్యాసిపాత్రుడు

నర్సీపట్నం: గ్రామదేవత మరిడమ్మతో పెట్టుకుంటే అయ్యన్నపాత్రుడుకు పతనం తప్పదని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చింతకాయల సన్యాసిపాత్రుడు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మంగళవారం ఆయన ఎమ్మెల్యే గణేష్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. తన తాత లచ్చాపాత్రుడు ఉన్నప్పటి నుంచి జాగారం ఉత్సవంలో అమ్మవారి గరగలు తమ ఇంటి నుంచే బయలుదేరటం ఆనవాయితీగా వస్తోందన్నారు. రెండ్రోజుల క్రితం తాను ఇంట్లో లేనని, తన భార్య అనిత, సోదరుల కుటుంబ సభ్యులు గరగలకు పసుపు, కుంకుమలు సమర్పించకుండా అయ్యన్నపాత్రుడు తాగి వీరంగం సృష్టించాడన్నారు. మద్యం మత్తులో అనుచితంగా ప్రవర్తిస్తూ ఇంట్లో ఆడవాళ్లపై దౌర్జన్యం చేశాడన్నారు. అమ్మవారిని ఎవరు పరిహాసం చేసినా నాశనమవటం ఖాయమన్నారు. గ్రామదేవత పండగను పసుపు కండువాలతో టీడీపీ పండగలా మార్చేశారని విమర్శించారు. అయ్యన్నపాత్రుడు వద్ద ఉన్న అమ్మవారి రూ.6 లక్షల గురించి ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అమ్మవారి నగలు ప్రభుత్వం పరం చేస్తానని సన్యాసిపాత్రుడు స్పష్టం చేశారు. అయ్యన్నపాత్రుడు కుటుంబానికి ఇచ్చే ప్రసక్తి లేదన్నారు. అమ్మవారి విషయంలో విర్రవీగితే కష్టాలు తప్పవన్నారు. ఒళ్లు దగ్గర పెట్టుకుని గ్రామదేవత పండగ సరిగా చేయకపోతే సర్వనాశ మవుతాడన్నారు.

మాడుగుల కోటపై వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేయాలి

- కుల సంఘాల సమావేశంలో ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు


మాట్లాడుతున్న అనకాపల్లి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు


హాజరైన వివిధ కుల సంఘాల నాయకులు

మాడుగుల: సార్వత్రిక ఎన్నికల్లో మాడుగుల కోటపై ముచ్చటగా మూడోసారి వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేయాలని, ఇందుకోసం ప్రతి కార్యకర్త చిత్తశుద్ధితో పని చేయాలని డిప్యూటీ సీఎం, అనకాపల్లి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు పిలుపునిచ్చారు. మంగళవారం రాత్రి మాడుగులలో పట్టణానికి చెందిన 12 కుల సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ హయాంలో చేపట్టిన ప్రజా సంక్షేమ కార్యక్రమాలే ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు శ్రీరామ రక్ష అన్నారు. మాడుగుల పట్టణాన్ని రూ.60 కోట్లతో అభివృద్ధి చేశానన్నారు. స్వాతంత్య్రం వచ్చిన నాటి నుంచి ఇంతవరకు ఏ నాయకుడూ చేపట్టిన అభివృద్ధి తన వల్లే సాధ్యమైందన్నారు. మాడుగుల నియోజకవర్గంలో తూర్పుకాపు ధ్రువపత్రాలు అందించిన ఘనత తనకే దక్కుతుందన్నారు. తన కుమార్తె ఈర్లె అనురాధను ‘మీ చేతిలో పెట్టాను, మీ బిడ్డగా ఆశీర్వదించి గెలిపించాలని’ అభ్యర్థించారు. ఎన్నోయేళ్లుగా కలగా మిగిలిన డి. గొటివాడ నుంచి సాగరం మీదుగా మాడుగుల దేవి ఆలయం వరకు తాచేరు నదిమీద బ్రిడ్జి, రహదారి నిర్మాణానికి రూ.7.60 కోట్లతో నిర్మించానన్నారు. నియోజకవర్గంలో ఎన్ని గ్రామాలు ఉన్నాయో తెలియని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పైలా ప్రసాదరావు గెలిచినా ఇక్కడ ఉండకుండా అమెరికా వెళ్లిపోతారన్నారు. ఎక్కడో కడప నుంచి వచ్చి ఇక్కడ ఎంపీగా పోటీ చేస్తున్న కూటమి అభ్యర్థి సీఎం రమేష్ అనకాపల్లి పార్లమెంటు పరిధిలో ఎన్ని గ్రామాలు ఉన్నాయో చెప్పాలన్నారు. అనకాపల్లి పార్లమెంటు స్థానం నుంచి రమేష్‌ను ఎదుర్కొనే సత్తా తనకే ఉందని, టికెటు ఇచ్చారన్నారు. మాడుగుల నియోజకవర్గంలో వంద రోడ్లు నిర్మించి రోల్ మోడల్‌గా తీర్చిదిద్దానన్నారు. ఎంపీపీ తాళ్లపురెడి వెంకటరాజారామ్, పార్టీ మండల అధ్యక్షుడు వేమవరపు రామధర్మజ, పట్టణాధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీను, విశాఖ డెయిరీ డైరెక్టరు శీరంరెడ్డి సూర్యనారాయణ, ఎంపీటీసీ సభ్యులు పోలిమేర విజయలక్ష్మి, కుక్కర మహేశ్వరి, సర్పంచ్ ఎడ్ల కళావతి, గొల్లవిల్లి సంజీవిరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ శ్రీనాథు శ్రీనివాసరావు, బసవ రామ పరమేశ్వరావు, రజక, నాయీబ్రాహ్మణ, విశ్వబ్రాహ్మణ, తదితర కులాల నాయకులు పాల్గొన్నారు.

వేతనదారులకు గిట్టుబాటు కూలి రూ.300


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఏపీడీ మణికుమార్

రావికమతం: మొన్నటి వరకూ ఉపాధి రోజు వేతనం రూ.272 ఉండగా, దీనికి అదనంగా రూ.28 పెంపుతో వేతనదారులంతా రూ.300 కూలి గిట్టుబాటయ్యేలా పని చేసుకోవాలని ఉపాధి ఏపీడీ మణికుమార్ తెలిపారు. ఒమ్మవరంలో ఉపాధి హామీ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధి పనుల్లో పాల్గొనే వారంతా ఉదయం, సాయంత్రం ఎండ వేడిమి తక్కువ ఉన్న సమయాల్లో పనిచేయాలన్నారు. అధికారులు ఆ విధంగా సూచనలు ఇవ్వాలన్నారు. నీటి నిల్వ ఉండే కుంటలకు, ఇంకుడు గొయ్యిలకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. జాబ్‌కార్డుకు వంద రోజుల పని కల్పించేలా ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లాలని సూచించారు. ఏపీవో దాడి వెంకట కాశి అప్పారావు, ఈసీ కామేశ్వరరావు, టీఏ కొండాజీ, రమణ పాల్గొన్నారు.

రాములోరి కల్యాణానికి ముస్తాబు


గుమ్ముడు వీధి రామకోవెలలో మహిళల పూలదండల అల్లికలు

రావికమతం: రాములోరి కల్యాణానికి గ్రామాలు ముస్తాబయ్యాయి. శ్రీరామ నవమి సందర్భంగా బుధవారం అన్ని ఆలయాల్లో స్వామి కల్యాణం నిర్వహించనున్నారు. ఈ మేరకు ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతోపాటు తాటికమ్మలతో చలువ పందిళ్లు వేశారు. మరుపాకలో పెండ్లిరాట వేశారు.

సీఎం బస్సు యాత్రను విజయవంతం చేద్దాం

– కె.కోటపాడు ఎంపీపీ జగన్‌మోహన్


మాట్లాడుతున్న రాజుబాబు


కె.కోటపాడులో మాట్లాడుతున ఎంపీపీ జగన్‌మోహన్

కె.కోటపాడు: చోడవరంలో ఈ నెల 20న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించే మేమంతా సిద్ధం బస్సు యాత్రలో మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్ తెలిపారు. మంగళవారం కె.కోటపాడులో సర్పంచ్, ఎంపీటీసీ, నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. మేమంతా సిద్ధం కార్యక్రమానికి మండలంలోని 32 పంచాయతీల నుంచి ఆరు వేల మందికిపైగా ప్రజలు తరలి రావాలని కోరారు.

చీడికాడ: చోడవరంలో మేమంతా సిద్ధం బస్సు యాత్రను విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు కోరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన కార్యకర్తలతో సమావేశమై మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి పార్టీ శ్రేణులతోపాటు ప్రజలు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు. సీడీసీ చైర్మన్ సుంకర శ్రీనివాసరావు, చీడికాడ, దండిసురవరం కో-ఆపరేటివ్ పర్సన్ ఇన్‌చార్జులు, మోసూరి సన్నిబాబు, నందారపు రమణబాబు, విశాఖ డెయిరీ డైరెక్టర్ శీరంరెడ్డి సూర్యనారాయణ, నాయకులు సన్యాసినాయుడు, ఈర్లె చైతన్య, పరువాడ మహేష్, ఎంపీపీ కురచా జయమ్మనారాయణమూర్తి, జెడ్పీటీసీ లాలం శారదాజానకీరాం పాల్గొన్నారు.

ఏటిగైరంపేటలో ముమ్మరంగా ఎన్నికల ప్రచారం

ఓటర్లను అభ్యర్థించిన నర్సీపట్నం ఎమ్మెల్యే గణేష్ సతీమణి కళావతి


ప్రచారం చేస్తున్న గణేష్ సతీమణి కళావతి

గొలుగొండ: ప్రజలకు నూరుశాతం సంక్షేమ పథకాలు అందించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరూ మద్దతు తెలపాలని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ సతీమణి కళావతి కోరారు. మంగళవారం రాత్రి ఏటిగైరంపేటలో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతీ ఇంటికి వెళ్లి ప్రజా సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. గతంలో టీడీపీ ఇచ్చిన హామీల్లో ఒక్కటైనా సక్రమంగా అమలు చేసిందా అని ప్రశ్నించారు. ఆరుసార్లు ఎమ్మెల్యేగా పని చేసిన అయ్యన్నపాత్రుడు చేయలేని అభివృద్ధిని ఐదేళ్లలోనే నర్సీపట్నం ఎమ్మెల్యే గణేష్ చేసి చూపించారన్నారు. తను చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని గుర్తించి మరోసారి అవకాశం ఇవ్వాలని కోరారు. జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ, పార్టీ నాయకులు పాము అప్పలనాయుడు, పాము రాజుబాబు, కార్యకర్తలు పాల్గొన్నారు.